# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నంలో ఈ సాయంత్రం జరిగే నౌకాదళ విన్యాసాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పాల్గొంటారు.**

2. **ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ రోజు ప్రారంభించారు.**

3. **ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

4. **మత్స్య కారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.**

5. **అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించిన లూయీ బ్రెయిలీ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం**

==========================

విశాఖ సముద్ర తీరంలో నౌకాదళ ముగింపు విన్యాసాలు ఈ సాయంత్రం ప్రారంభమవుతాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పాల్గొంటారు. తూర్పు నావికాదళం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై మరింత సమాచారాన్ని విశాఖపట్నం ఆకాశవాణి ప్రతినిధి వి ఎస్ మూర్తి అందిస్తారు.

వాయిస్ ( 37 సెకన్లు)

--------------------------

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ రోజు ప్రారంభించారు. విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కళాశాలలో ప్రయోగశాలలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఈ సందర్భంగా ఉండాలని మంత్రి సూచించారు.

--------------------------

ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద పలు రకాల చికిత్సలను అందిస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 37 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ వసతిగృహాలను పునరుద్ధరించి, మౌలిక సౌకర్యాలను కల్పించనున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర జిల్లాల సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు, ఎస్సీ డైరెక్టర్లు, ఇతర అధికారులతో మంత్రి నిన్న సమీక్షించారు. సదుపాయాల పునరుద్ధరణ పనులను 143 కోట్ల రూపాయలతో చేపట్టనున్నామని ఆయన తెలిపారు. గురుకులాలు, వసతిగృహాల్లో వందశాతం ప్రవేశాలు కల్పించాలని అధికారులకు సూచి0చారు.

---------------------------

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై ఆ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా నిన్న నిర్వహించిన సమావేశంలో మంత్రి పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2028-29 మధ్యకాలంలో 2 కోట్లకు పైగా గృహాలను రాష్ట్రంలో నిర్మించేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని, వీటికి అర్హులైన లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. లబ్దిదారుల ఎంపికలో కొన్ని మినహాయింపులు ఇవ్వాలని కేంద్రమంత్రిని ఈ సందర్భంగా పార్థసారధి కోరారు.

---------------------------

మత్స్య కారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగిలో ఓఎన్జీసీ పైపులైన్ వల్ల నష్టపోయిన మత్స్యకారులకు నష్టపరిహారాన్ని మంత్రి నిన్న అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సముద్రంలో వేట నిషేధం ప్రారంభానికి ముందే ఏప్రిల్ 1వతేదీ న మత్స్యకారుల ఖాతాల్లో 20 వేల రూపాయల చొప్పున జమచేస్తామని తెలిపారు.కేరళ తరహాలో మత్స్యకారులకు హార్బర్లు, జట్టీలు, వంటి సౌకర్యాలు మెరుగుపరుస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 28 సెకన్లు)

---------------------------

అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయులు లూయీ బ్రెయిలీ జయంతి ఈరోజు 1809 జనవరి 4వ తేదీన ఫ్రాన్స్ లోని "క్రూవేలో" జన్మించిన బ్రెయిలీ తన పరిశోధనల ద్వారా అంధులకు ప్రత్యేక లిపి ని సృష్టించి గొప్ప మార్పుకు నాంది పలికారు. ఆయన జయంతిని పురస్కరించుకొని జనవరి 4వ తేదీని ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అతి కీలకమైన అంశాన్ని శోధించి అంధులకు దిక్సూచిగా నిలిచిన బ్రెయిలీ 1852 జనవరి 6వ తేదీన 43 ఏళ్ళ వయసులో కన్నుమూశారు..

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టే విశాఖపట్నం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి విశాఖపట్నంతో పాటు పరిసర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన దృశ్యమాధ్యమ విధానంలో సమీక్ష నిర్వహించారు. వాహనాల పార్కింగ్, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.కాగా ప్రధానమంత్రి ఈ నెల 8వ తేదీ సాయంత్రం విశాఖపట్నం చేరుకొని సంపత్ వినాయకుని గుడి నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని సభావేదిక వరకు రోడ్ షో నిర్వహించనున్నారు.

---------------------------

ప్రజలకు మెరుగైన పాస్ పోర్ట్ సేవలనుఅందించేందుకు కృషి చేస్తున్నామని విజయవాడ ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయ అధికారి శివ హర్ష తెలిపారు. విజయవాడలో ఈ రోజు 2024 సంవత్సరానికి సంబంధించి కార్యాలయం అందించిన సేవలను పాత్రికేయులకు వివరించారు. 2024 సంవత్సరంలో 3 లక్షల 23 వేల 553 పాస్ పోర్ట్ సంబంధిత సేవలను అందించామని చెప్పారు. ఈ నెలలో ప్రతి బుధవారం పాస్ పోర్ట్ ధరఖాస్తుదారులకు ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని శివ హర్ష తెలుపుతూ, వాయిస్

(34 సెకన్లు)

---------------------------

రాష్ట్రానికి కొత్తగా 10 చేనేత క్లస్టర్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఒక్కొక్కటి, తిరుపతి జిల్లాలో రెండు క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం పంపగా వీటిని కేంద్రప్రభుత్వం ఆమోదించింది. ఇందులో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు, తిరుపతి పరిధిలో క్లస్టర్ల ఏర్పాటుకు తొలి విడతగా 5కోట్లు రూపాయలు విడుదల చేసింది. మిగతావాటికి 2కోట్ల రూపాయల మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సంక్రాంతి నాటికి క్లస్టర్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, వీటి ఏర్పాటుతో 2వేల మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరనుందని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ -ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమర్పించిన విద్యుత్తు ఛార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ఆ సంస్థ ఉన్నతాధికారి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో, 10వ తేదీన కర్నూలులోని రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి కార్యాలయంలో ఈ ప్రక్రియను చేపడతామన్నారు.

=====================